నిధులు మంజూరైనా.. జాడలేని పనులు

- అస్తవ్యస్తంగా రోడ్లు
- అవస్థలు పడుతున్న ఆయా గ్రామాల ప్రజలు
- రోడ్లు అభివృద్ధి చేయాలని వేడుకోలు

సారంగాపూర్: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్న' చందంగా మారింది సారంగాపూర్ మండలంలోని అభివృద్ధి పనుల పరిస్థితి. ప్రభుత్వం నిధులు మంజూరైనా పనులు చేపట్టడంలో అధికారుల అలసత్వంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్బీ శాఖ గతంలో ఏర్పాటు చేసిన రోడ్లకు కనీసం నిర్వహణకు నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. వర్షాకాలం కావడంతో ప్రజలకు రోడ్లపై ప్రయాణం సమస్యగా మారింది. ఆయా రోడ్ల మీద గుంతలు ఏర్పడి, కంకర తేలి కనీసం నడవడం కూడా కష్టంగా ఉంది. నిధుల మంజూరైనా కొన్ని రోడ్ల పనులు ప్రారంభం కాలేదు. మరికొన్ని రోడ్ల అభివృద్ధి కోసం నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు.

సారంగాపూర్ నుంచి బట్టపల్లి–పోతారం గ్రామాలకు భీమన్న ఆలయం సమీపం నుంచి వెళ్లే ఆర్అండ్బీ రహదారి కంకర తేలి, రెండేళ్లుగా రోడ్డుపై కనీసం నడవ లేని స్థితి ఉంది. రెన్యువల్ బీటీ వేయడానికి రూ. 25 లక్షలు మంజూరై, టెండర్లు జరిగినా పనులు ప్రారంభం కాలేదు. దీనిపై పూర్తిస్థాయిలో తిరిగి కొత్తగా బీటీ వేయడానికి కొత్త బడ్జెట్లో రూ. 1.40 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

- జగిత్యాల నుంచి సారంగాపూర్, బీర్పూర్ మండలాలకు వచ్చే ప్రధాన రహదారిపై కోనాపూర్ వాగు వద్ద రూ. 5.65 కోట్లతో ఏర్పాటు చేసిన హైలెవల్ వంతెన పనులు పూర్తి అయినా, వంతెనకు ఇరువైపులా అప్రోచ్రోడ్డు నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.


పోతారం-బట్టపల్లి-సారంగాపూర్ గ్రామాల మధ్య శిథిలమైన తారు రోడ్డు

- జగిత్యాల నుంచి వచ్చే ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిపల్లి ఊరకుంట వద్ద సేఫ్టీవాల్స్ నిర్మాణం కోసం రూ. 4 లక్షలు మంజూరు కాగా, పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ప్రస్తుతం కుంట వద్ద రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి అధికారులు రూ. 45 లక్షలతో ప్రతిపాదనలు పంపారు.
- రేచపల్లి నుంచి పోతారం వరకు, రేచపల్లి నుంచి రాయికల్ మండలం తాట్లవాయి వరకు 9.70 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి 2.94 కోట్లతో చేపట్టిన పనుల్లో రేచపల్లి–పోతారం గ్రామాల మధ్య తారు కోసం రోడ్డు పనులు చేపట్టి కంకరవేసి వదలిపెట్టారు. దీనితో వాహనదారులు కంకరపై వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.
- నాయికపుగూడెం వద్ద ప్రమాదకరంగా ఉన్న వంతెనకు ఇరువైపులా సేఫ్టీవాల్ నిర్మాణంతో పాటు, బీర్పూర్ మండలం వరకు ఉన్న రోడ్డులో కొత్తగా మొత్తం మూడు కల్వర్టులు నిర్మాణం కోసం రూ. 30 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు త్వరలో మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు. వర్షాలతో పనులు చేపట్ట లేకపోతున్నామని, వర్షాకాలం పూర్తి కాగానే పూర్తి చేస్తామని, మండలంలో మరిన్ని రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్బీ అధికారులు పేర్కొన్నారు.

పనులు పూర్తి చేయాలి



సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాల మధ్య రోడ్డు వర్షాలకు బురదమయంగా మారింది. కంకర తేలి గుంతలు ఏర్పడి నడవడం కష్టంగా ఉంది. నిధులున్నా పనులు చేపట్టడం లేదు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– నలువాల సుమన్, సారంగాపూర్

ప్రమాదాలు జరుగుతున్నాయి



రేచపల్లి–పోతారం గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన రోడ్డుపై కంకర వేసి తారు వేయకుండా వదిలిపెట్టడంతో వాహనదారులు కంకరపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఓ కారు చెట్టుకు ఢీకొనడంతో రేచపల్లికి చెందిన రాజేశం అనే వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు.

– బీర మహేశ్, రేచపల్లి

క్లుప్తంగా

కస్తూర్బా పాఠశాలలో తహసీల్దార్ తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూరు శివారులోని కస్తూర్బా గాంధీ పాఠశాలను తహసీల్దార్ కిషన్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి ఆవరణలో గడ్డి, పొదలు లేకుండా చూసుకోవాలన్నారు. కిచెన్, కూరగాయలను పరిశీలించి మెనూ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం క్లాస్ రూంకు వెళ్లి కొంత సేపు విద్యార్థులను ఇంగ్లిష్, సాంఘీక శాస్త్రంలో పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేందర్ రావు, పాఠశాల ఇన్చార్జి ఉన్నారు.

ఐకేపీ కార్యాలయంలో ముందస్తు రాఖీ వేడుకలు


ఐకేపీ సిబ్బందికి రాఖీలు కడుతున్న మహిళలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య సభ్యులు ఐకేపీ ఉద్యోగులు, సిబ్బందికి రాఖీలు కట్టారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు మారు సత్తమ్మ, ఏపీఎం గంగాధర్, సీసీలు మరియ, వీవోఏలు జల, భాగ్యలక్ష్మి, జయ, లక్ష్మి, స్టాఫ్ పద్మ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో ఏవో తనిఖీ


ఈ పాస్ యంత్రం తనిఖీ చేస్తున్న ఏవో దీపిక

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, ఎర్దండి ఫర్టిలైజర్ షాపులతోపాటు ఇబ్రహీంపట్నం సహకారం సంఘంలో ఏవో దీపిక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో ఈ పాస్ యంత్రం ద్వారా రైతులకు అమ్మిన ఎరువులను ఏ విధంగా నమోదు చేస్తున్నారో, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతీ రైతు ఎరువులు కొన్న వెంటనే ఈ పాస్ యంత్రం ద్వారా నమోదు చేయాలని, బోర్డుపై స్టాక్ వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నరేశ్, సీఈవో మంత్రి సతీశ్, రాజేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ


చెక్కులు అందజేస్తున్న నాయకులు

మేడిపల్లి: మండలంలోని దేశాయిపేటలో ఉరుమట్ల గంగు అనే మహిళకు రూ.60 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, రాజిరెడ్డి, జగన్రెడ్డి, మహేశ్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి నుంచి మేడిపెల్లి మండలం వల్లంపెల్లి వరకు తారు రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. సమస్యను విన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండలాధ్యక్షుడు అలకొండ లింగంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రూరల్ సీఐ కార్యాలయం మార్పు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయం శుక్రవారం మార్పు చేశారు. గతంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పైన కార్యాలయ సేవలు అందించగా, ప్రస్తుతం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లోని రెండో అంతస్తు భవనంలోకి మార్చినట్లు రూరల్ సీఐ వై.కృష్ణారెడ్డి తెలిపారు.



పెగడపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి యాపల్ చెరువు వరకు ఉన్న తారురోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న ఈ రహదారికి సుమారు 20 ఏళ్ల కిందట తారు వేశారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు లేక రోడ్డు వర్షాలకు లోతైన గుంతలు ఏర్పడి రాకపోకలకు అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అబ్దుల్ రహమాన్, పీఆర్ ఈఈ, ఫోన్ నంబర్: 9440049017

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705346639

సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మల్యాల: మండలంలోని తాటిపల్లి, రాంపూర్, పోతారం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస్, దయానంద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు జిల్లా రెడ్డి సంఘం సర్వసభ్య సమావేశం

జగిత్యాలజోన్: జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు రెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎడమల శైలేందర్ రెడ్డి తెలిపారు. సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికల ప్రక్రియ విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ప్రమాదానికి కారకుడైన ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రోడ్‌లో ఆర్టీసీ బస్సు దిగుతుండగా డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణం కావడంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. పట్టణంలోని గోవిందుపల్లికి చెందిన శేషగాని నాగరాజు పని నిమిత్తం ఆంధ్రకు వెళ్లి ఈనెల 14న ఉదయం వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులో జగిత్యాలకు వచ్చాడు. జగిత్యాల బస్టాండ్‌లో నాగరాజు నిద్రలో ఉండటంతో బస్సు బస్టాండ్ దాటిన తర్వాత స్వప్న దాబా వద్ద డ్రైవర్ బస్సు ఆపమని కోరగా బస్సు నిలిపే ప్రయత్నం చేశాడు. దీంతో నాగరాజు బస్సు దిగుతుండగా డ్రైవర్ అజాగ్రత్తగా బస్సు నడపడంతో నాగరాజు కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో బాధితుడి భార్య శేషగాని భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పలువురు

జగిత్యాల: ఇటీవల జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారిగా నియమితులైన వెంకటేశ్వర్లు, రియల్ ఎస్టేట్ జిల్లా నూతన కార్యవర్గసభ్యులు శుక్రవారం వేర్వేరుగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కాలనీ ప్రజలు కలిశారు. స్పందించిన ఎమ్మెల్యే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేశ్, లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జేఎల్ఎంలకు అసిస్టెంట్ లైన్‌మెన్లుగా పదోన్నతి

మల్లాపూర్: మండల పరిధిలోని విద్యుత్‌శాఖలో జేఎల్ఎంలుగా పనిచేస్తున్న ఆరుగురికి అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు మల్లాపూర్ విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ ఏడీఈ శ్రీనివాస్‌రావు శుక్రవారం ఉత్తర్వు కాపీలు అందజేశారు. రంజిత్, విష్ణు, క్రాంతి, రాజేష్, వినోద్, ఇసాక్ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

వాజ్‌పేయికి నివాళి

జగిత్యాలటౌన్: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో శుక్రవారం భారత్ సురక్షా సమితి నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏసీఎస్ రాజు, అక్కినపెల్లి కాశీనాథం తదితరులు పాల్గొన్నారు.

యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

కోరుట్ల: యువతకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరని మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు అన్నారు. పట్టణంలోని మాస్టర్ మైండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోరుట్ల సీఐ సురేశ్ బాబు, మాస్టర్ మైండ్ సీఈవో శివరాత్రి శివప్రసాద్ పాల్గొన్నారు.

మేరు పట్టణ సంఘం అధ్యక్షుడిగా విశ్వనాథం

రాయికల్: పట్టణ మేరు పట్టణ సంఘం అధ్యక్షుడిగా సంగ విశ్వనాథం, ఉపాధ్యక్షుడిగా మాడిశెట్టి రాజు, ప్రధాన కార్యదర్శిగా సింగు ఆనంద్, సహాయ కార్యదర్శిగా రాయిల్ల జనార్దన్, కోశాధికారిగా కొట్టూరి సత్తయ్యలు ఎన్నికైనట్లు జిల్లా కోశాధికారి రాపర్తి నర్సయ్య, జిల్లా కార్యదర్శి రాయిల్ల ప్రభాకర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: 2024–25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్ అందించేందుకు నిర్ణయించడం జరిగిందని, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిల్యాండ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివేందుకు అర్హత గల విద్యార్థులు WWW.TELANGANAEPASS.CGG.GOV.IN వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షలతో పాటు, వీసా, టికెట్ ఫేర్ కూడా చెల్లించడం జరుగుతుందన్నారు.

కౌన్సిలర్‌కు మృతికి సంతాపం

మెట్‌పల్లి: అనారోగ్యంతో మృతి చెందిన 14వార్డు కౌన్సిలర్ మర్రి పోచయ్య అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. అంతకుముందు ఆయన మృతదేహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ మోహన్, వివిధ పార్టీల నాయకులు నివాళి అర్పించారు.


ధర్మపురిలో వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహిళలు కుంకుమార్చనలు


జగిత్యాలలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/కోరుట్ల/కోరుట్ల రూరల్/రాయికల్/ధర్మపురి/ కథలాపూర్/ పెగడపల్లి/ మల్యాల/ మల్లాపూర్: శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు చేసుకున్నారు. వరలక్ష్మీ వ్రతం కావడంతో వ్రతాలు, నోములతో ఆలయాలు సందడిగా మారాయి. మహిళలు వరలక్ష్మీ వ్రతాలు చేసుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయాల్లో పెద్ద ఎత్తున మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


మల్లాపూర్ వాసవీమాత ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు


కథలాపూర్‌లో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు


రాయికల్‌లో మహిళల పూజలు


పెగడపల్లిలో..

బీఆర్ఎస్ యూత్ కో–ఆర్డినేటర్ల నియామకం

జగిత్యాల: పార్టీ పటిష్టతకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. జగిత్యాల రూరల్ మండల యూత్ అధ్యక్షుడిగా పిన్నంశెట్టి సదానందం, జగిత్యాల అర్బన్, రూరల్ మండల యూత్ కో–ఆర్డినేటర్‌గా కల్లూరి హరీశ్‌ను నియమించినట్లు తెలిపారు. వారి నియమకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బాపురెడ్డి, ఆసీఫ్, మల్లారెడ్డి, వొల్లం మల్లేశం, వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.


విద్యాసాగర్‌రావును అభినందిస్తున్న నాయకులు

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్/మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ కథలాపూర్ మహిళా విభాగం ఆధ్వర్యంలో, మేడిపల్లి, భీమారం మండలాల్లో మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం దహనం చేశారు. మహిళల పట్ల అనుచిత వాఖ్యలు చేసిన కేటీఆర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలు పులి శిరీష, మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ ఎం.డీ అజీమ్, మేడిపల్లి, భీమారం అధ్యక్షులు నరేశ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం నియామకంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ధర్మపురి: ధర్మపురి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం నియామకంపై ఈనెల 12న ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పాలకవర్గ సభ్యుల్లో కమిటీ చైర్మన్‌గా చిలుముల లక్ష్మి (నాగారం), వైస్ చైర్మన్‌గా సంగ నర్సింహులు (దోనూర్), డైరెక్టర్లుగా సరద లక్ష్మణ్ (దొంతాపూర్), ఎండీ రఫియొద్దీన్ (ధర్మపురి), వంకదొత్తు గీతాంజలి (ధర్మపురి), మెరుగు పరుశరాం గౌడ్ (నేరెల్ల), ఎన్నం మధుకర్‌రెడ్డి (కోస్నూర్‌పల్లె), తాండ్ర అశోక్‌రావు (సిరికొండ), ఏనుగు జోగిరెడ్డి (తాళ్ల ధర్మారం), రామడుగు రవి (రంగపేట), కాశెట్టి రాజేశ్ (ధర్మపురి), గునిశెట్టి అంజన్న (ధర్మపురి), దైత శ్రీనివాస్ (తిమ్మాపూర్)తో పాటు తిమ్మాపూర్ పీఏసీఎస్ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్లతో ప్రతిపాదనలు పంపించారు.

ధర్మపురి మార్కెట్ కమిటీలో ఉమ్మడి మండల వాసులకు చోటు

సారంగాపూర్: ధర్మపురి మార్కెట్ కమిటీలో సారంగాపూర్, బీర్పూర్ మండలాలకు ఒక్కొక్కరికి చొప్పున రెండు డైరెక్టర్ల పదవులు దక్కాయి. సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన రామడుగు రవి, బీర్పూర్ మండలం తాళ్ల ధర్మారం గ్రామానికి చెందిన ఏనుగు జోగిరెడ్డి డైరెక్టర్లుగా నియామకం అవ్వడంతో వీరిద్దరు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఈవో బదిలీ

వెల్గటూర్: ఎండపల్లి మండలం గొడిశెలపేట క్లస్టర్‌లో ఏడేళ్లుగా పనిచేస్తున్న ఏఈవో అయ్యోరి వినోద్ బీర్పూర్ మండలం మంగెళ క్లస్టర్‌కు బదిలీ చేస్తున్నట్లు శుక్రవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఇన్నేళ్లుగా విధి నిర్వహణలో తనకు సహకరించిన తోటి ఉద్యోగులు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

అలుగు పారిన పెద్ద చెరువు

ఇబ్రహీంపట్నం: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసి భారీ వర్షానికి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు మత్తడి దుంకుతోంది. వర్షంతో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం నుంచి కొత్త బస్టాండ్ వరకు, ఇందిరా గాంధీ చౌరస్తాలో రోడ్డుపై భారీగా వరద పారింది. వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు.



మహిళలు ఉన్నత విద్యనభ్యసించాలి

జగిత్యాలరూరల్: మహిళలు ఉన్నత విద్యనభ్యసించి అన్ని రంగాల్లో ముందుండాలని జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ అశ్విని అన్నారు. శుక్రవారం జిల్లా మహిళ అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికారత కేంద్ర బృందం జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో షీటీం, సైబర్ క్రైమ్ వారితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ సమానత్వం, లింగ వివక్షతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫోక్సో చట్టాలపై బాలికల్లో అవగాహన ఉండాలని, బేటీ బచావో, బేటీ పడావోపై వివరించారు. ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే సఖీ అందించే సేవలు, సైబర్ నేరాలు, వాటితో కలిగే అనర్థాలపై ఎలా బయట పడాలన్నదానిపై వివరించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ మెంబర్ రాజేందర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధారాణి, షీటీం ఏఎస్సై అలీ బేగ్, మహిళ కానిస్టేబుళ్లు రాజా, పూజిత, చైల్డ్ హెల్ప్‌లైన్ స్టాఫ్ మానస, రజిత పాల్గొన్నారు.